క్లుప్తంగా

తాగునీటి సమస్యలను పరిష్కరించాలి

పొన్నూరు: మండలంలోని గ్రామాల్లో తాగు నీటి సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని మండల పరిషత్ అధ్యక్షురాలు భవనం పద్మలీల అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభకు ఎంపీపీ అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మండలంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివిధ శాఖల అధికారులు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అంబటి రాఘవరావు, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడి సన్మానం



గుంటూరు రూరల్: రాష్ట్రంలో యువతను రాజకీయాలు, సమాజ సేవ, సమాజాభివృద్ధికి ఉపయోగపడే విధంగా కృషి చేసిన నాయకుడు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఏటుకూరు బైపాస్‌లోని నియోజకవర్గ కార్యాలయంలో ఇటీవల నూతనంగా వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి బలసానిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి కృతజ్ఞతాభినందనలు తెలిపారు. అనంతరం ఉత్తేజ్‌రెడ్డిని శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

ప్రారంభమైన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలో సమర్థనం దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నూతన బ్యాచ్‌కు నగరంలోని పలువురు పెద్దలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆశ్వని హాస్పిటల్ ఎమ్‌డీ డాక్టర్ ఆవుల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు, ఎమ్ఆర్‌కే పరమహంస, పీకే శ్రీనివాస్, సెంటర్ మేనేజర్ బి.రంగారావు పాల్గొని ప్రస్తుతం పోటీ ప్రపంచంలో స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా వచ్చే ఉపాధి అవకాశాలను వివరించారు. సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కాటా మోసాలపై పర్యవేక్షణ కరువు!

గుంటూరు రూరల్: నగర శివారుల్లో ఏటుకూరు శ్మశానం చెరువు కట్ట వద్ద బుధవారం చేపల విక్రయాలను ఏర్పాటు చేశారు. విక్రయదారుడు కాటాలో కేజీలకు బదులు లీటర్లలో చేపల విక్రయాలు చేస్తున్నారని పలువురు ఆరోపించారు. దీంతో కొందరు వినియోగదారులు కాటా మోసం ఉందని గ్రహించి వారి వద్దనున్న సెల్‌ఫోన్‌ను కాటాలో వేయగా సెల్‌ఫోన్ 360 గ్రాములు వచ్చింది. దానిని అతను సమీపంలోని మరో దుకాణంలో కాటా వేయగా అదే సెల్‌ఫోన్ 200 గ్రాములు వచ్చిందని తెలిపారు. కాటాలపై తూనికలు కొలతల శాఖ పర్యవేక్షణ లేకపోవటంతో ఇష్టానుసారంగా వినియోగదారులను మోసం చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అనుమతులు లేకుండా కాటాలను వినియోగిస్తున్న వారిపై ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకుని కాటాలు, కొలతలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి



గుంటూరు రూరల్: గుర్తు తెలియని వ్యక్తి మురుగు కాలువలో పడి మృతి చెందిన సంఘటన బుధవారం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లకుంట ఆర్చ్ సెంటర్ వద్ద సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మురుగు కాలువలో పడి మృతి చెంది ఉన్నారని స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడు బ్లూ కలర్ చారల చొక్కా, బ్లూ జీన్స్ ధరించి ఉన్నారని ఆచూకీ తెలిసిన వారు నేరుగా నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

సాంఘిక బహిష్కరణపై కఠిన చర్యలు తీసుకోవాలి

నెహ్రూనగర్: దళితులపై వివక్ష, అంటరానితనం ఇంకా కొనసాగుతూనే ఉందని అందుకు నిదర్శనం పిఠాపురం నియోజకవర్గంలోని మల్లాం గ్రామ సాంఘిక బహిష్కరణ అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చందోలు శశికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాంఘిక బహిష్కరణకు ప్రధాన కారకులైన వారిపై అట్రాసిటీ చట్టం కింద వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికశాఖ కార్డుల పేరిట పైసా వసూల్

- ఆయుష్మాన్ భారత్, ఈ శ్రమ్ కార్డులకు రూ.100 డిమాండ్
- ఉచితంగా చేయని రిజిస్ట్రేషన్ ప్రక్రియ

ప్రత్తిపాడు: కార్మికశాఖ కార్డులు (ఈ శ్రమ్) పేరిట ఆశాఖ పురమాయించిన కొందరు వ్యక్తులు డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఉచితంగా చేయాల్సిన ఈ శ్రమ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను డబ్బులిస్తేనే చేస్తామని.. లేదంటే చెయ్యలేమని తేల్చి చెబుతున్నారు. ఒక్కో కార్డుకు రూ.50 చొప్పున రెండు రకాల కార్డులకు రూ.100 ప్రజల నుంచి వసూలు చేస్తున్నారు. వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగస్తులకు ఈ శ్రమ్ కింద రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసేందుకు ప్రభుత్వం ఈ ఏడాది జనవరి నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా లేబర్ శాఖ అధికారులకు మండలాలు, డివిజన్లు వారీగా టార్గెట్‌లు కూడా ఇచ్చింది. లేబర్ శాఖ అధికారులు మండల స్థాయిలో ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ఈ శ్రమ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. కానీ సంబంధిత శాఖల మధ్య సమన్వయ లోపంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. దీంతో లక్ష్యాలను చేరుకునేందుకు లేబర్ శాఖ అధికారులు కొందరు ప్రైవేట్ వ్యక్తులకు రిజిస్ట్రేషన్ బాధ్యతలు అప్పగించారు. వారితో గ్రామాల్లో ఈ రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు.

రిజిస్ట్రేషన్‌కు డబ్బులు వసూలు..

ప్రైవేట్ వ్యక్తులు బృందాలుగా నిర్ణీత గ్రామాలకు వెళ్లి, ఆటోల్లో కాన్వాస్‌లు చేస్తున్నారు. ప్రభుత్వం



రిజిస్ట్రేషన్ కోసం కార్మికశాఖ పురమాయించిన యువతులు

వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అందించే ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు, కార్మికశాఖ ద్వారా అందించే ఈ శ్రమ్ కార్డులు రిజిస్టర్ చేస్తున్నామని.. ఆయా కార్డుల ద్వారా ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు బహుళ ప్రయోజనాలున్నాయని ప్రచారం చేస్తున్నారు. దీంతో పెద్ద సంఖ్యలో ప్రజలు కార్డులు రిజిస్టర్ చేయించుకునేందుకు సంబంధిత ప్రాంతానికి వెళుతున్నారు. తీరా అక్కడకు వెళ్లిన తరువాత అక్కడ ఉన్న కార్మిక శాఖ పురమాయించిన వ్యక్తులు ఆయుష్మాన్ భారత్ కార్డుకు రూ.50.. ఈ శ్రమ్ కార్డుకు రూ.50 చొప్పున ఒక్కక్కరి నుంచి రూ.100 డిమాండ్ చేస్తున్నారు. రూ.100 ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని తేల్చిచెబుతూ వసూళ్లకు పాల్పడుతున్నారు. వాస్తవానికి రెండు కార్డులకూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి ఉచితంగా చేయాల్సి ఉంది. కానీ ప్రభుత్వ అధికారులు పురమాయించిన వ్యక్తులే ఇలా లామినేషన్ కార్డుల పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడటం.. ఆ కార్డులు కూడా స్పాట్‌లో కాకుండా వారం తరువాత ఇక్కడికే తీసుకువచ్చి ఇస్తామని చెప్పి డబ్బులు తీసుకోవడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి రిజిస్ట్రేషన్ చేసినప్పుడు జనరేట్ అయ్యే కార్డును సంబంధిత వ్యక్తుల వాట్సాప్‌కు పంపినా సరిపోతుంది. కానీ అలా చేయకుండా డబ్బులు వసూలు చేస్తున్నారు.



రిజిస్ట్రేషన్ వారి నుంచి తీసుకుంటున్న డబ్బులు

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిగా ఉచితం..

ఈ శ్రమ్ కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిగా ఉచితం. రిజిస్ట్రేషన్‌కు డబ్బులు ఇవ్వాల్సిన పనిలేదు. ఎవ్వరైనా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఫిజికల్‌గా కార్డు కావాలనుకుంటనే వారికి డబ్బులు చెల్లించాలి. లేదంటే డబ్బులు ఇవ్వవలసిన అవసరం లేదు. డబ్బులిస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామనడం సరికాదు. సంబంధిత వ్యక్తులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మా శాఖ ద్వారానే అప్పగించాం.

– అనిత, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, ప్రత్తిపాడు

ఉచిత దంత వైద్య శిబిరం

గుంటూరు రూరల్: దంత సంరక్షణపై ప్రతి ఒక్కరిలో అవగాహన ఉండాలని సిబార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ ఆర్థోడెంటిక్స్ విభాగం ప్రొఫెసర్, హెడ్ డాక్టర్ పి.రేవతి అన్నారు. బుధవారం చౌడవరం గ్రామంలోని ఆర్.వి.ఆర్.జె.సి ఇంజనీరింగ్ కళాశాలలో సిబార్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దంత నిపుణులు విద్యార్థులకు నోటీ ఆరోగ్యంపై దంత పరీక్షలు నిర్వహించి, సమస్యలు నివారణకు అవసరమైన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని, కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు కార్యక్రమంలో ఆరోగ్య సమస్యలపై మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, సిబార్ వైద్యులు ప్రొఫెసర్ డాక్టర్ పి.శరవణన్, ప్రొఫెసర్ డాక్టర్ సంజీవ్‌జకాటి, డాక్టర్ డొక్కు అరుణ, డాక్టర్ కె.అపర్ణ, డాక్టర్ హెప్సీబ పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

చేబ్రోలు: ఉన్నతాధికారులను సంతృప్తి పరచడం కోసం సిబ్బంది పని చేయవద్దని.. ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతో పని చేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలు గ్రామ పంచాయతీలోని చెత్త నుంచి సంపద కేంద్రం (ఎస్‌డబ్ల్యూపీసీ) షెడ్‌ను ఆయన బుధవారం పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూ ఎస్‌పీ షెడ్డును పరిశీలించిన ఆయన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్మశానం రోడ్డులోని చెత్త డంపింగ్ ప్రదేశాన్ని పరిశీలించి రోడ్డు పక్కన చెత్తాచెదారం వేయడంతో పాటు తగలబెట్టడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మొక్కుబడిగా రికార్డులు చూపకుండా వాస్తవాలను తెలియజేయాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలోని మీటింగ్ హాలులో ఆయన అధికారులతో మాట్లాడారు. మరలా చేసే తనిఖీల్లో పూర్తి స్థాయిలో మార్పు రావాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్, ఎంపీడీవో ఎ.ఉమాదేవి, ఈవోపీఆర్డీ టి.ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పట్టాభిరామ్

అధిక మార్కులతో ప్రతిభ చూపిన విద్యార్థులు



టి.ముకేశ్‌రెడ్డి, 586



జ్యోతిర్మయిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భాషా

పొన్నూరు: పది పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ ఎస్ఎఫ్ఎస్ భాషా అన్నారు. పట్టణానికి చెందిన సాయి కృతిక్, జ్యోతిర్మయి విద్యార్థులు 597 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారని అన్నారు. కె. ప్రియమణి 594.. సీహెచ్.దీపిక 592 మార్కులు సాధించారని తెలిపారు.

ప్రత్తిపాడు: మండలంలోని 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మొత్తం 362 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 321 మంది ఉత్తీర్ణులయ్యారు. టి.ముకేశ్‌రెడ్డి 586 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు.

వట్టిచెరుకూరు మండలంలో..

వట్టిచెరుకూరు హైస్కూల్ 100 శాతం, అనంతవరప్పాడు హైస్కూల్ 90, గారపాడు హైస్కూల్ 85, పల్లపాడు హైస్కూల్ 94, కాట్రపాడు హైస్కూల్ 67, వింజనంపాడు హైస్కూల్ 86, కొర్నెపాడు 94, ముట్లూరు హైస్కూల్ 99, సెయింట్ జ్ఞేవియర్స్ ముట్లూరు స్కూల్ 89 శాతం ఉత్తీర్ణతలు సాధించాయి.

కాకుమాను మండలంలో..

కాకుమాను హైస్కూల్ 86.57, చినలింగాయపాలెం హైస్కూల్ 100, కొమ్మూరు హైస్కూల్ 86.96, గరికపాడు హైస్కూల్ 100, రేటూరు హైస్కూల్ 83.33, బోడిపాలెం హైస్కూల్ 91.67, ఏపీఎస్‌డబ్ల్యూజీఆర్ఎస్ 98.65 ఉత్తీర్ణతలు సాధించాయి.

పెదనందిపాడు మండలంలో..

కొప్పర్రు హైస్కూల్ 81.81, అన్నపర్రు హైస్కూల్ 92.85, జీజీపాలెం హైస్కూల్ 100, ఏబిపాలెం హైస్కూల్ 100, గోగులమూడి హైస్కూల్ 100, పుసులూరు హైస్కూల్ 92.30, పెదనందిపాడు హైస్కూల్ 87.5, ఉప్పలపాడు హైస్కూల్ 82.75, ఎస్ఎస్ ప్రభుత్వ హెచ్ఎస్ పాఠశాల 83.333 ఉత్తీర్ణత సాధించాయి. ప్రైవేట్ పాఠశాలల్లోనూ విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు.

గుంటూరు రూరల్: పదో తరగతి ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారని బాసర విద్యాసంస్థల ఛైర్మన్ సాధినేని మురళి మోహన్‌రావు తెలిపారు. షేక్ సాధిక 577.. జి.త్రివేణి 573.. బి.స్మృతి 572 మార్కులు సాధించారు.

'పది'లో వికసించిన విద్యా కుసుమాలు

గుంటూరు రూరల్: పదో తరగతి ఫలితాలు రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో స్థానిక విద్యార్థులు తమ సత్తా చాటారు. ప్రతిభతో వికసించిన విద్యా కుసుమాలను పలువురు అభినందించారు. ఏటుకూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 585 మార్కులు సాధించి బుర్రి రూపశ్రీదత్ మొదటి స్థానంలో ఉందని ప్రధానోపాధ్యాయురాలు వై.వాణి అన్నారు. తోకాచిచ్చు ప్రియవందన 581తో ద్వితీయస్థానం.. డేగల భవాని 574తో తృతీయ స్థానంలో నిలిచారన్నారు. ప్రతిభావంతులను ఎమ్మెల్యే బి.రామాంజనేయులు అభినందించారు. సీనియర్ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, కార్పొరేటర్ లక్ష్మిదుర్గ, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, మార్కండేయులు, ఉపాధ్యాయులు కె.బసవలింగారావు, వేణుగోపాల్, శ్రీనివాస్, మారుతి, పద్మ, రత్నమాల, హసీన పాల్గొన్నారు.



ఉత్తమ విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే బి.రామాంజనేయులు



సురేష్ 556



నిహారిక 540

గుంటూరు రూరల్: పది ఫలితాల్లో అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచిందని ప్రధానోపాధ్యాయురాలు సరోజిని అన్నారు. సురేష్ 556 మార్కులతో ప్రథమ స్థానంలో.. నిహారిక 540 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. గణిత ఉపాధ్యాయుడు జ్ఞానయ్య, యంయల్‌సీ లేళ్ల అప్పిరెడ్డి విద్యార్థులను అభినందించారు.



ఎస్.అక్షయ్‌కుమార్, 588



ఎం.గణేష్, 584



వై.మనీష, 582



కె.గీతిక, 582

చేబ్రోలు: మండలంలోని వడ్లమూడి చాణక్య హైస్కూల్ విద్యార్థులు పది ఫలితాల్లో ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ సీహెచ్ శివరామకృష్ణ అన్నారు. ఎస్.అక్షయ్‌కుమార్ 588 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఎం.గణేష్ 584.. వై.మనీష 582.. కె.గీతిక 582 మార్కులు సాధించారు. వీరిని ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.



వై.మౌర్య భూషణ్, 585



పి.సతీష్, 579



ఎ.మౌనిక లక్ష్మీశివానీ, 554

చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు జడ్పీ హైస్కూల్‌లో వై.మౌర్య భూషణ్ 585 మార్కులు, పి.సతీష్ 579 మార్కులు సాధించారు. వేజండ్ల జడ్పీ హైస్కూల్‌లో ఎ.మౌనిక లక్ష్మీశివాని 554 మార్కులు, ఎం.రాజేశ్వరి 538 మార్కులు సాధించారు. శేకూరు జడ్పీ హైస్కూల్‌లో డి.రాకేష్ 564 మార్కులు సాధించారు.



అక్కి అఖిలను అభినందిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరెడ్డి

పొన్నూరు: మండలంలోని నండూరు గ్రామం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని అక్కి అఖిల 584 మార్కులతో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. పట్టణంలోని నేతాజీనగర్ ఎంపీఎల్ హైస్కూల్ విద్యార్థులు ఎం.చేతన్‌సాయి అక్షహంత్, ఏఎల్ఎన్ఎస్ సుతీక్షణలు 578 మార్కులతో ద్వితీయ స్థానం.. బ్రాహ్మణకోడూరులో ఉప్పల జ్యోతి స్వరూప్ 574 మార్కులతో తృతీయ స్థానం దక్కించుకున్నారు. పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో ప్రతిభావంతులను ఎంఈఓ కె.శ్రీనివాసరెడ్డి అభినందించారు.

పెదకాకాని: పది పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారని మండల విద్యాశాఖాధికారి శంకరరాజు అన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించి బాలికలే పైచేయి సాధించారని తెలిపారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. పెదకాకాని మండలంలో ఏడు జిల్లా పరిషత్ పాఠశాలలు నుంచి 555 మంది పరీక్షలు రాయగా 421 మంది ఉత్తీర్ణులయ్యారు. మండల వ్యాప్తంగా 75.86 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ప్రైవేటు పాఠశాలల్లోనూ ఉత్తీర్ణతలు..

మండలంలో ఐదు ప్రైవేటు పాఠశాలల నుంచి 844 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరు కాగా 694 మంది ఉత్తీర్ణులయ్యారు. దీంతో 82.23 ఉత్తీర్ణతా శాతం నమోదైంది. పెదకాకాని గీతాంజలి ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థిని పి.హెన్నా ప్రసన్న 589 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది.



ఎస్ మౌనిక, 574



జి.హుమైల, 571



ఎస్.మౌనికను అభినందిస్తున్న పాఠశాల హెచ్ఎం వసుంధరా దేవి

ఉపాధ్యాయుడికి సత్కారం

పెదకాకాని: ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూనే సేవా భావంతో సహాయ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి శంకరరాజు అన్నారు. పెదకాకాని విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం రాష్ట్రస్థాయిలో 2025 ఉగాది సేవా రత్న అవార్డు అందుకున్న పెదకాకాని పాఠశాల ఉపాధ్యాయుడు, మండల ఎస్.టి.యు గౌరవ అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్‌కు ఘన సత్కారం నిర్వహించారు. శంకరరాజు మాట్లాడుతూ.. ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న మురికిపూడి దేవపాల్ నిరంతరం ఏదో ఒక రూపంలో ఇతరులకు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. కరోనా సమయములో రూ.10 లక్షల సహాయ కార్యక్రమాలు చేయడమే కాకుండా ఇటీవల విజయవాడ వరదల సమయంలో స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో రూ.కోటి వరద సహాయం చేయించిన మానవతావాది దేవపాల్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎస్.కె బాజీ, కుటుంబరావు, ప్రసాద్, లింకన్ ఆనందరావు, కాళిదాసు, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయంలో దశల వారీగా క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది, ఎమినిటీ సెక్రటరీలు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. పాత గుంటూరు, మారుతీ నగర్, బాలాజీ నగర్ ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ నిర్మాణాలలో నాణ్యతా లోపం గుర్తిస్తే తక్షణం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇప్పటికే వార్డు సచివాలయాల వారీగా అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, సదరు పనులను ప్రాధాన్య క్రమంలో చేపడతామని వివరించారు. ఆయా ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలని, డోర్ టూ డోర్ చెత్త సేకరణ నూరు శాతం జరగాలని ప్రజారోగ్యాధికారులను ఆదేశించారు. పర్యటనలో ఏఈ పి.వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్ పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్ తనిఖీ

నగర పరిధిలోని అన్న క్యాంటీన్లను నోడల్ అధికారులు ప్రతి రోజు పరిశీలించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం నల్లచెరువు అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. క్యాంటీన్‌కు వచ్చే ప్రజల సంఖ్యకు అనుగుణంగా ఇండెంట్ పెంచుకోవాలని, ఏ ఒక్కరికి ఆహారం అందలేదని ఫిర్యాదు రాకూడదని అక్షయ పాత్ర సిబ్బందికి సూచించారు.

మీరు చెప్పిందే జేఏసీ కోరుతోంది

బెటర్ శంకర్ విలాస్ ఫ్లైఓవర్ సాధన సమితి

గుంటూరు ఎడ్యుకేషన్: శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జికి సంబంధించి జేఏసీ కొత్తగా ఏమీ కోరట్లేదని, గతంలో ప్రభుత్వం ప్రకటించిన డిజైన్ ప్రకారమే ఫ్లైఓవర్ నిర్మించాలని కోరుతున్నామని బెటర్ శంకర్ విలాస్ ఫ్లైఓవర్ సాధన సమితి నాయకులు కోరారు. బుధవారం అరండల్‌పేటలోని ఓ హోటల్లో మీడియా సమావేశంలో జేఏసీ నాయకులు ఎల్ఎస్ భారవి, పీవీ మల్లికార్జునరావు మాట్లాడుతూ గతంలో గల్లా జయదేవ్ ఎంపీగా ఉన్నప్పుడు, తాజాగా ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక కూడా ఐకానిక్ బ్రిడ్జి నిర్మిస్తామని, అండర్ బ్రిడ్జి కూడా ఉంటుందని ప్రకటించారన్నారు. కానీ తీరా డిజైన్ చూశాక యూటర్న్ తీసుకున్నారన్నారు. బ్రిడ్జి పొడవును 930 మీటర్లకు కుదించి, ఆర్‌యూబీ కూడా లేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొదట ప్రకటించిన ఒరిజినల్ డిజైన్ ప్రకారం హిందూ కాలేజి కూడలి నుంచి లాడ్జి సెంటర్ వరకూ ఐకానిక్ ఫ్లైఓవర్ నిర్మించాలని, ఆర్‌యూబీ నిర్మించాలని, సర్వీసు రోడ్లు కనీసం 30 అడుగుల వెడల్పుతో ఉండాలని జేఏసీ తరపున కోరుతున్నట్లు చెప్పారు. సమావేశంలో అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, జేఏసీ నాయకులు వెంకట్రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎల్ఎస్ భారవి

విద్యుత్ స్తంభం విరిగిపడి ఒకరికి గాయాలు



నెహ్రూనగర్: సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులు చేపడుతున్న సమయంలో విద్యుత్ స్తంభం విరిగిపడి ఓ వ్యక్తి గాయపడడంతో పాటు మూడు ద్విచక్రవాహనాలు దెబ్బతిన్నాయి. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 54వ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్ 4వ లైనులో సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనుల కోసం కాంట్రాక్టర్లు పొక్లెయిన్‌తో గోతులు తీస్తున్న క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి తగిలి కింద పడిపోయింది. దీంతో అక్కడే ఉన్న ఓ వ్యక్తి తలకు గాయం కాగా జీఎంసీ సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. దీంతో పాటు మూడు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. స్తంభం పడిపోగానే వైర్లు రాసుకుని విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రాణపాయం తప్పింది.

రేపు ఎస్‌హెచ్‌ఓలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్, జాతీయ అధ్యక్షురాలు, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.విజయ ఇచ్చిన పిలుపుమేరకు ఏప్రిల్ 25, 26 తేదీల్లో ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో 'ఉచిత బీపీ పరీక్ష శిబిరం' నిర్వహిస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ టి.సేవ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెక్ బీపీ–స్టాప్ స్ట్రోక్ నినాదంపై ప్రజల్లో చైతన్యమే లక్ష్యంగా సైలెంట్ కిల్లర్‌గా పేర్కొనే అధిక రక్తపోటు కారణంగా సంభవిస్తున్న పక్షవాతం నిరోధమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ సదుపాయాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గుంటూరు రూరల్: వ్యక్తి అదృశ్యంపై నల్లపాడు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. గోరంట్ల గ్రామం సున్నపు బట్టీల సెంటర్‌కు చెందిన మంగీలాల్ సోలాంకి అనే వ్యక్తి ఈనెల 20వ తేదీ నుంచి కనిపించడంలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేశామన్నారు. మంగీలాల్ రాజస్థాన్ నుంచి వచ్చి వినాయకుని విగ్రహాలు తయారు చేసే పని చేస్తుంటారన్నారు. అతనికి మతిస్థిమితం లేదని ఇంటి నుంచి వెళ్లే సమయంలో చామన ఛాయ రంగులో, గడ్డం ఉండి ఖాకీ రంగు ఫ్యాంటు, మెరూన్ కలర్ చొక్కా ధరించి ఉన్నారని తెలిపారు. వయస్సు 48 సంవత్సరాలు, ఎత్తు 5.5 అడుగులు ఉంటారని అన్నారు. ఆచూకీ తెలిసిన వారు నేరుగా నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో లేదా.. 86888 31376, 86888 31606 నంబర్లలో సంప్రదించాలని కోరారు.